ప్రజాశక్తి

సోమవారం 10 ఫిబ్రవరి 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు
- రూ.21 కోట్లతో సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డిబివి స్వామి
- ఉత్సాహంగా జడ్పీ సర్వసభ్య సమావేశం

జడ్పీ సమావేశంలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మంత్రులు స్వామి, గొట్టిపాటి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా అభివద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధులు, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఈ దిశగా సమన్వయంతో ముందుకు వెళుతుందన్నారు. స్థానిక పాత జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర మంత్రులు డిబివి స్వామి, గొట్టిపాటి రవి కుమార్, ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ, బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, జడ్పీ సిఈఒ బి.చిరంజీవి పాల్గొన్నారు. ఇద్దరు ఎమ్మెల్సీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. చాలా రోజుల తరువాత జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొనటంతో సమావేశం కళకళలాడింది. అజెండాలోని అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మీడియాతో మాట్లాడుతూ విద్య, రహదారులు భవనాలు, సంక్షేమం, పౌరసరఫరాలు, విద్యుత్ శాఖకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించామన్నారు. విద్యా విధానంలో దేశానికే మోడల్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచేలా మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టి సారించారన్నారు. ఈ దిశగా నిపుణులతోనూ, ప్రజా ప్రతినిధులతోనూ ప్రత్యేకంగా చర్చిస్తున్నట్లు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ప్రకాశం జిల్లాకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ళలో మరమ్మతుల కోసం రూ.17 కోట్లను మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం సరిగా దష్టి సారించకపోవటంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాలేదని, వాటిని రప్పించడంపై తమ ప్రభుత్వం దష్టి పెట్టిందన్నారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆయా అంశాలపై చర్చించినట్లు తెలిపారు. జిల్లాలో తాగునీటి ▶ 2లో

మాట్లాడుతున్న మంత్రులు స్వామి, గొట్టిపాటి

విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించండి

జడ్పీలో అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

8లో ▲

జడ్పీలో ప్రోటోకాల్ రగడ

కాసేపు వాదోపవాదనలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లా పరిషత్ సమావేశం ముగిసే సమయంలో ప్రోటోకాల్ రగడ ఒక్కసారిగా ఉత్కంఠకు దారితీసింది. ఎమ్మెల్సీ తూమాటి మాదవరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను పిలవడం లేదని, కనీస మర్యాద కూడా పాటించడంలేదని ఆరోపించారు. ఆయనకు మద్దతుగా వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు తదితరులు తమకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని ఆగ్రహంగా మాట్లాడారు. దీనికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్పందిస్తూ గతంలో ఎలా వ్యవహరించారో గుర్తు చేసుకోవాలంటూ గట్టిగానే సమాధానం ఇచ్చారు. కాసేపు దీనిపై వాదోపవాదనలు జరిగాయి. అరుపులు చోటుచేసుకున్నాయి. వెంటనే మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందిస్తూ ప్రోటోకాల్ గురించి మాట్లాడుకోవాలంటే మరో సమావేశం పెట్టుకొని గతంలో మీరు ఎలా వ్యవహరించారో అన్నీ చర్చిద్దామన్నారు. జడ్పీలో కేవలం అభివృద్ధి, సంక్షేమమేనని ముందుగానే చెప్పానని, దాన్ని మరిచిపోయి రాజకీయాలు తేవడం సరైంది కాదన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వెంటనే సమావేశాన్ని ముగించారు.

మంత్రులు స్వామి, గొట్టిపాటికి అర్జీ ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు, నాయకులు

మద్యం మత్తులో..
తండ్రిని చంపిన తనయుడు

3లో ▲

ఆస్తి వాటాలు తేలితేనే..
అంత్యక్రియలు.?

మెయిన్ 5లో ▲

జిల్లా అభివృద్ధికి
రూ.10 వేల కోట్లు రాబట్టాలి

- మంత్రులకు, ఎమ్మెల్యేలకు సిపిఎం వినతి
- చర్చకు జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ అంగీకారం
- దాటేసిన జిల్లా మంత్రులు
- ప్రభుత్వంతో చర్చిస్తామన్న అధికార పక్షం
- శాసనసభలో చర్చకు ప్రతిపక్షం హామీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివద్ధికి, పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు నిధులు రాబట్టాలని జిల్లాకు చెందిన మంత్రులు, జిల్లా పరిషత్ ఛైర్మన్, అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులను సిపిఎం కోరింది. ఆదివారం నాడు ఆ పార్టీ బందం జిల్లాపరిషత్ సమావేశం మందిరం వద్ద జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు ▶ 7లో

ప్రజల గొంతుకగా 'లక్ష్మణరావు'

కెఎస్.లక్ష్మణరావు

- అన్ని తరగతుల సమస్యలపై నిరంతర పోరాటం
- రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్సీగా 14 ఏళ్ల ప్రస్థానం
- మండలి బరిలో మరోసారి పోటీ
- నేడు గుంటూరులో నామినేషను దాఖలు
- భారీగా తరలిరానున్న ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక నేతలు

ప్రజాశక్తి-బాపట్ల, గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో శాసనమండలి పునరుద్ధరణ తరువాత సుదీర్ఘకాలం పనిచేసిన ఎమ్మెల్సీల్లో కె.ఎస్.లక్ష్మణరావు ప్రముఖంగా నిలుస్తున్నారు. గుంటూరు హిందూ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తూ 2007లో తొలిసారిగా శాసనమండలి సభ్యులుగా ఆయన ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన మూడు సార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. ఐదోసారి ఆయన ఈ నెల 27న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. 14 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం ఎమ్మెల్సీగా పనిచేసిన ఆయన అన్ని తరగతుల ప్రజల గొంతుకగా పనిచేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, మహిళలు, అంగన్‌వాడీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలతో పాటు పింఛనర్లు వివిధ తరగతులకు చెందిన సమస్యలపై మండలిలో పోరాడారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషించారు. 2014 వరకు కాంగ్రెస్, 2014 నుంచి 2019 వరకు టిడిపి, 2019 నుంచి 2024 వరకు వైసిపి, తిరిగి ▶ 2లో

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామ న్నారు. ఎవరైనా ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేయకుండా దొంగ లెక్కలు చెప్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, అదే సమయంలో అభివద్ధి విషయంలోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. జడ్పీటిసిలు, ఎంపిపిలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. గత సమా వేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను కూడా అధికారులు తెలియజేసినట్లు మంత్రి చెప్పారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత హాస్టల్ మరమ్మతులు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సమావేశంలో రోడ్ల మరమ్మతులు, ఇతర అభివద్ధి కార్యక్రమాలపై చర్చించామన్నారు. ఒంగోలు, టంగుటూరు, అద్దంకి, పొదిలి, కనిగిరి, పామూరు, యర్రగొండపాలెం, కందుకూరు, బేస్తవారపేట వంటి మండలాలలో రహదారులు సక్రమంగా లేక ప్రమాదాలు జరిగి ప్రజలు మరణిస్తున్నారన్నారు. ఆయా మండలాలలో ప్రతిపాదించిన ప్రాంతాలలో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో రహదారులు, రైల్వే లైన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు భూములు ఇచ్చిన ప్రజలకు మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించామన్నారు. విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బేసిక్ ఎలిమెంటరీ స్కూల్స్, మోడల్స్ స్కూల్స్ ఏర్పాటులో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలని, కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తూమాటి మాధవరావు, ఒంగోలు, సంతనూతలపాడు, చీరాల, దర్శి, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బిఎన్ విజయ్‌కుమార్, ఎంఎం కొండయ్య, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ చుండి సుజ్ఞానమ్మ, వివిధ శాఖల అధికారులు, జడ్పీటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

రూ.768 కోట్లతో జడ్పీ బడ్జెట్ ఆమోదం

జిల్లా ప్రజాపరిషత్ 2025-26 సంవత్సరానికి రూ.768 కోట్ల బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. జిల్లా పరిషత్, ఇంజినీరింగ్ విభాగాల ఆదాయ, వ్యయాలను పద్దుల వారీగా కలుపుకొని బడ్జెట్‌ను తయారు చేశారు. 2025-26 సంవత్సరపు బడ్జెట్ అంచనాలతో రూ.768,33,59,019 ఆదాయంగా తీసుకొని రూ.767,35,32,849 వ్యయంగా చూపించి రూ.9,82,6170 మిగులు చూపుతూ రూపొందించిన బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. 2023-24 సంవత్సరంలో ఆదాయం రూ.652,44,3478 కాగా వ్యయం రూ.566,83,8955గా చూపించారు. 2024-25 సంవత్సరంలో ఆదాయం రూ.636,69,81463 కాగా వ్యయం రూ.585,40,00094 చూపించారు. 2025-26 సంవత్సరంలో ఆదాయం రూ.768,33,59,019లు, వ్యయం రూ.767,35,32,849గా చూపించారు.

12న ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని దేవరాజుగట్టు గ్రామంలో వెలిసిన శ్రీహజరత్ సయ్యద్ హనీఫ్‌షా ఖాద్రి అవులియా బాబా ఉరుసు మహోత్సవం ఈ నెల 11వ తేదీన ప్రారంభం అవుతుందని దర్గా పీఠాధిపతి సయ్యద్ తాజ్‌హుస్సేన్ శనివారం తెలిపారు. 11వ తేదీన గుసూల్ ముబారక్, 12వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు జెండా ఉత్సవం, గంధోత్సవం, సాయంత్రం అన్నదానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 13వ తేదీ గురువారం సాయంత్రం 6గంటలకు దీపారాధనతో ఉరుసు మహోత్సవం ముగుస్తుందని వివరించారు.

పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి శింగరాయకొండ పోలీస్ స్టేషన్ ను ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకస్మికంగా సందర్శించి పోలీస్ స్టేషన్ మొత్తం పరిశీలించారు. ప్రజల సహకారంతో పోలీస్ స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని సూచిం చారు. ఆవరణాన్ని, గదులను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, సిడి ఫైల్స్‌ను, పలు రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుం టున్న చర్యలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరిత గతిన దర్యాప్తు పూర్తిచేసి తక్షణమే ఫిర్యాదుదారులకు పరిష్కారం అందించాలని అన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే అకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టంగుటూరు, శింగరాయకొండ పోలీస్ స్టేషన్ భవనాలు చాలా సంవత్సరాల క్రితం నిర్మించినవి కావడం వల్ల అవి బాగా పాడైపోయాయని, ప్రజల భాగస్వామ్యంతో ఆ పోలీస్ స్టేషన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ప్రతి అంశంపై పోలీస్ స్టేషన్లో పరిశీలించి సూచనలను చేసినట్లు

స్టేషన్లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి ఏఆర్ దామోదర్

తెలిపారు. శింగరాయకొండ పోలీస్ స్టేషన్‌ను ఒక మోడల్ పోలీస్ స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వివరించారు. ఎస్‌పి వెంట ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు, శింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య, శింగరాయకొండ ఎస్ఐ బి మహేంద్ర, జరుగుమల్లి ఎస్ఐ మహేంద్ర ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, సిబ్బంది ఉన్నారు.

టంగుటూరు: జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్ జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. మిస్సింగ్ కేసులు, చనిపోయిన వారి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ సాధారణ తనిఖీలలో భాగంగా జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. వీరి వెంట శింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య, జరుగుమల్లి ఎస్ఐ బి మహేంద్ర ఉన్నారు.

12న విద్యుత్ ఉద్యోగుల వైద్య, రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఒంగోలులోని యూనియన్ కార్యాలయ ఆవరణలో ప్రాంతీయ శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ సంజీవరావు, సిహెచ్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మార్కాపురం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కే మల్లికార్జునరావు, సిహెచ్ రవికాంత్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఏపిఈఈయు-1104 యూనియన్ కార్మికుల శ్రేయస్సు లక్ష్యంగా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అలుపెరగని పోరాటాలు చేస్తూ 75 వసంతాలు పూర్తి చేసుకుని 76 వసంతంలోకి అడుగెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని యూనియన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏపిఈఈయు-1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు మార్కాపురం డివిజన్ నుంచి అధిక సంఖ్యలో విద్యుత్ కార్మికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

మంత్రిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-పొన్నలూరు

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిని ఆయన నివాసం వద్ద కలిశారు. విద్యుత్ సమస్యలపై మంత్రికి వివరించారు. అనంతరం విద్యుత్ కార్మిక సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఇచ్చారు. అనంతరం రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యను కలిసి డైరీ, క్యాలెండర్ ఇచ్చి సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ నాయకులు, డివిజన్ నాయకులు, తెలుగు నాడు విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా 'లక్ష్మణరావు'

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వంలో కూడా వివిధ అంశాలపై మండలి సమావేశాల్లో ఆయన స్పందించారు. మండలిలో ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతో పాటు బయట జరిగే ప్రజా ఉద్యమాల్లో కూడా భాగస్వాములయ్యారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ గుంటూరు ఛానల్, వరికెపుడిశెల, కౌలు రైతుల సమస్యలు, పట్టణాల్లో మౌలిక వసతులు, ఆర్‌వోబిలు, ఆర్‌యుబిలు, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలపై కూడా మండలితో పాటు గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో కూడా పోరాటం కొనసాగిస్తున్నారు. లక్ష్మణరావు పోరాటం ఫలితంగా గుంటూరులో ఇప్పటికే పలు ఆర్‌వోబిలు మంజూరు అయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న వేలాది మందికి పట్టాలు ఇప్పించేందుకు, ప్రభుత్వ భూములలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి క్రమబద్ధీకరణ పట్టాలు ఇప్పించేందుకు వివిధ దశల్లో జరిగిన పోరాటాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏ కొండూరు మండలంలో కిడ్నీ బాధితుల సమస్యలపై లక్ష్మణరావు మండలిలో ప్రముఖంగా ప్రస్తావించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితులను అదుకునేలా కృషి చేశారు. అలాగే జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఈ మండలంలోని ప్రజలకు తాగునీటి పథకం మంజూరుకు ప్రభుత్వంపై వత్తిడి చేసి మంజూరు చేయించారు. గంపలగూడెం మండలంలో కట్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం పలు మార్లు మండలిలో ప్రస్తావించారు. ప్రభుత్వ అధికారులతో చర్చించి బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేశారు. మామిడి రైతుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించారు. మిర్చి రైతులు, సుబాబుల సాగు దారుల సమస్యలపై పలు మార్లు అధికారులతో చర్చించడం, మండలిలో ప్రస్తావించడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనేక అంశాలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజామోద నిర్ణయాలు తీసుకుంటే మద్ధతు ఇస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం కొనసాగించారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారానికి చేసే కృషి కన్నా ప్రతిపక్ష పాత్ర పోషించే తనను ఎన్నుకుంటే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని కె.ఎస్.లక్ష్మణరావు చెప్పారు.

నేడు గుంటూరులో నామినేషన్

కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో పాల్గొని అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో టీచర్లు, గ్రాడ్యుయేట్ల సమస్యలపై ప్రాతినిధ్యం కోసం ఏర్పాటు చేసిన టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ రాజకీయ పార్టీలు నేరుగా పోటీ చేస్తున్నాయని ఈ సందర్భంగా లక్ష్మణరావు అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల సమస్యలకు మండలిలో గొంతుకగా ఉంటానని తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఇతర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వృద్ధులకు భోజనం అందిస్తున్న చిన్నారి

భోజనం అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు: టంగుటూరు అరుంధతి నగర్‌కు చెందిన కీ.శే కురుగుంట్ల దావీదు వర్ధంతిని పురస్కరించుకుని టంగుటూరు, సింగరాయకొండ ప్రాంతాల్లో తిరిగే అనాథలకు, యాచకులకు, వృద్ధులకు భోజనం ప్యాకెట్స్, వాటర్ బాటిల్స్ ఇచ్చి వారి ఆకలిని తీర్చారు. యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులలో ఒకరై, కీ.శే కురుగుంట్ల దావీదు వర్ధంతిని పురస్కరించుకొని మంచి కార్యక్రమం చేయడానికి ముందుకు వచ్చిన కురుగుంట్ల ప్రవీణ్, అతని కుటుంబ సభ్యులు అభినందనీయులని యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ వారు అన్నారు.

ఒంగోలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS.No. 1075 / 2022
పువ్వాడ వెంకట సుబ్బయ్య ...వాది
మరియు
పువ్వాడ శ్రీనివాసరావు వగైరాలు ...ప్రతివాదులు
ప్రకటన
To.
పువ్వాడ శ్రీనివాసరావు, S/o. లేటు పుల్లయ్య,
1వ లైను, గోపాల నగరం, క్రిష్ణమందిరం దగ్గర, పాత ING వైశ్య బ్యాంకు బిల్డింగు పైన, ఒంగోలు.
పై నెంబరు దావాలో కోర్టువారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ ముట్టనందున మీ నోటీసు నిమిత్తం తేది: 25-3-2025న వాయిదా అయిఉన్నది. కావున తేదీ: 25-3-2025న ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక లాయరు గారి ద్వారా గానీ హాజరు పడి మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేనియడల మీ పరోక్షమున కేసు తీర్మానము చేయబడునని తెలియ చేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 25-3-2025 ఇట్లు
ఒంగోలు యం. గంగాధరరావు,
తేది: 09-2-2025 బి.ఎ.,బి.ఎల్.
కె. శివప్రసాదరావు,
బి.యస్సీ., బి.యల్.
వాది తరపు అడ్వకేట్స్, ఒంగోలు

వేలం ప్రకటన
మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్ట్ లో
E.P. 12/2019 in O.S. 27/2018
Between:
గుర్రం లక్ష్మణరావు ...డి.హెచ్.ఆర్/ పిటిషనరు
and
మువ్వ శంకర్ ...జే.డి.ఆర్/ రెస్పోండెంట్స్
పైన నెంబర్ అమలు పిటిషనులో ఈ దిగువ తెలిపిన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని పై కోర్ట్ వారి ద్వారా, పై కోర్ట్ లో తేది: 17-03-2025 తేదీన ఉదయం గం.10.30. ని.లకు లగాయత్తు బహిరంగ వేలం ద్వారా విక్రయించ బడునని ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయటమైనది. కావున వేలం పాటలో పాల్గొనదలచినవారు పై కోర్ట్‌లో హాజరు అయి పాటలో పాల్గొనవచ్చును.
ప్రకాశం జిల్లా (ప్రస్తుత బాపట్ల జిల్లా) - మార్టూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు యద్దనపూడి మండలం పూనూరు గ్రామపంచాయతి - పూనూరు గ్రామం సర్వే నెంబర్ 536 వార్డు నెంబర్ 2 తలుపు నెంబరు 2-8- అస్సెస్మెంటు నెంబరు 208లో ఆర్ సి సి రూఫ్ నివాస గృహం మరియు కాళీ స్తలము మొత్తము విస్తీర్ణం య.0.02 సెంట్లుకు హద్దులు:
తూర్పు : బత్తుల శంకరరావు
దక్షిణం : పంచాయితీ బజారు.
పడమర : విల్లినేని వెంకటరావు
ఉత్తరం : బత్తుల రామ కోటయ్య.
D.Hr విలువ **రూ .2,00,000/-**
అమీనా విలువ **రూ.6,00,000/-**
వేలంతేది : 17-03-2025
ఫర్దర్ హియరింగ్ : 24-03-2025
(కోర్ట్ వారి ఉత్తరువుల మేరకు)
పర్చూరు. ఇట్లు
ది: 06.02.2025 పోతిని సురేంద్ర
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి
D.Hr తరపు అడ్వకేట్స్.

ప్రజాశక్తి
సోమవారం 10 ఫిబ్రవరి 2025

మద్యం మత్తులో..

తండ్రిని చంపిన తనయుడు

ప్రజాశక్తి - దొనకొండ

జన్మనిచ్చిన తండ్రి నిద్రిస్తుండగా మద్యం మత్తులో కన్నకొడుకు అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పైడిపోగు యేసు (79) తన ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవటంతో మద్యం మత్తులో ఉన్న రెండవ కుమారుడు మరియదాసు చెట్లు కోసే రంపం బ్లేడుతో దారుణంగా కొట్టి కోయటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం మరియదాసు రోడ్డుపై సంచరిస్తూ అనుమానస్పదంగా మాట్లాడుతుండటంతో ఒకరిద్దరు చూసి అతన్ని ఇంటివద్దకు తీసుకెళ్లి చూడగా మంచంపై రక్తపుమడుగులో పడి ఉన్న యేసును చూసి భయాందోళనలకు గురయ్యారు. వెంటనే ఇరుగుపొరుగు వాళ్లు అక్కడకు చేరుకొని హంతకుడు మరియదాసు పారిపోకుండా పట్టుకొని స్తంభంకు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన యేసు

పైడిపోగు యేసు(ఫైల్)

రైల్వేశాఖలో పనిచేస్తూ రిటైర్ అయ్యారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా ముగ్గురికి వివాహలు చేశారు. కొన్నేళ్ల క్రితం భార్య మృతి చెందింది. పెద్దకుమారుడు నాగేశ్వరరావు అదే గ్రామంలో వేరుగా నివసిస్తున్నాడు. రెండవ కుమారుడు మరియదాసు అతని భార్య, ఇద్దరు కుమార్తెలు తండ్రి యేసు ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. మరియదాసు మద్యం సేవించి తరచూ ఇంట్లో గొడవ పడుతుంటాడు. వారం రోజుల క్రితం భార్యతో గొడవ పడటంతో ఆమె పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. మరియదాసు శనివారం తండ్రి వద్ద డబ్బులు తీసుకొని పుల్‌గా మద్యం సేవించి రోడ్డుపై పడిపోవటంతో తండ్రి గ్రామస్తుల సహకారంతో ఇంటికి చేర్చాడు. అర్ధరాత్రి స్పృహలోకి వచ్చిన మరియదాసు ఇంట్లో ఎవ్వరూ లేకపోవటంతో గాఢ నిద్రలో

పైడిపోగు యేసు మృతదేహం

నిందితుడిని కట్టేసిన స్థానికులు

ఉన్న తండ్రిని కిరాతకంగా హత్య చేశాడు. సంఘటన స్థలాన్ని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ హస్సాన్, పోలీస్ సిబ్బంది యేసు మృతదేహన్ని పరిశీలించారు. పెద్ద కొడుకు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణంలో రైలు పేటకు చెందిన కేసాని రవీంద్ర (48) ఆదివారం తమ నివాస గృహంలో ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. బంధువులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఊర్వశి బార్‌లో కేసాని రవీంద్ర క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. అనారోగ్య సమస్యతో గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళొచ్చిన క్రమంలో భార్య మద్యం తాగొద్దన్నందుకు మనస్థాపానికి గురై భార్యను పుట్టింటికి పంపాడు. ఇద్దరు కుమార్తెలను బయట ఆడుకోమని చెప్పి ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. బయట ఆడుకోవడానికి వెళ్లిన పిల్లలు ఇంటికి వచ్చి చూసేసరికి ఉరి వేసుకున్నాడని బంధువులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆసుపత్రి అవుట్ పోస్ట్ ఏఎస్ఐ రామయ్య తెలిపారు.

సికింద్రాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైటమంజులూరు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పంగులూరు

సికింద్రాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బైటమంజులూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. బైట మంజులూరులోని మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బైట మంజులూరు గ్రామానికి చెందిన సరికొండ రవిరాజు (50) గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాదులో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన రవిరాజు అన్న కుమారుడి వివాహం జరగాల్సి ఉండగా, సికింద్రాబాద్‌లో ఉన్న తన బంధువులకు పెళ్లి కార్డు ఇచ్చేందుకు రవిరాజు బాబాయి కొడుకుతో కలిసి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో రవిరాజుకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెనుక కూర్చొని ఉన్న అతని బాబాయి కొడుకుకి స్వల్ప గాయాలయ్యాయి. రవి రాజును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు బైట మంజులూరు గ్రామస్తులు తెలిపారు. రవిరాజుకు భార్య రమాదేవి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెల్లో ఒకరు డిగ్రీ చదువుతుండగా, కూడా మరొకరు ఇంజనీరింగ్ చదువుతున్నారు. రవిరాజు మరణ వార్త తెలిసి బైటమంజులూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు ఇవ్వాలి

ప్రజాశక్తి-బాపట్ల

డాక్టర్ విజయమ్మ

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్.విజయమ్మ ఆదివారం తెలిపారు. ఈ నెల 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు తప్పనిసరిగా ఈ మాత్రలు మింగించాల న్నారు. నులిపురుగులు శరీరంలో రక్తహీనత, ఆకలి లేకపోవడం, కడుపు నొప్పి, వికారం లాంటి ఇబ్బందులు కలిగిస్తాయన్నారు. నివారణ చర్యల్లో భాగంగా ప్రతి బిడ్డకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని తెలిపారు. పదో తేదీన పాఠశాలకు హాజరు కాని విద్యార్థినీ విద్యార్థులకు 17న ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించి జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల

ఉరుకుల పరుగుల జీవితంతో సమాజానికి సేవ చేసే జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల యజ్ఞ హాస్పిటల్ వైద్యులు యజ్ఞ శ్రీకాంత్ బెల్లంకొండ జర్నలిస్టులకు సూచించారు. ఆదివారం యజ్ఞ హాస్పటల్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో రోటరీ కళ్యాణ మండపంలో జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో రక్తపరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, జనరల్ ఫిజిషియన్ కన్సల్టేషన్ వంటి సేవలను జర్నలిస్టులు కుటుంబ సభ్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా యజ్ఞ శ్రీకాంత్ బెల్లంకొండ మాట్లాడుతూ జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. సహకరించిన మండలి సభ్యులు, వైద్య నిపుణులు, హాస్పటల్ సిబ్బంది, రోటరీ క్లబ్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేపల్లెలో వృద్ధురాలి హత్య

కుటుంబ కలహాలే కారణమా..?

ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -రేపల్లె

సరస్వతి (ఫైల్)

రేపల్లె పట్టణంలో వృద్ధురాలి హత్య స్థానికంగా కలకలం రేపింది. రేపల్లె పట్టణంలోని మూడో వార్డు మునసబు వారి పాలెంకి చెందిన పసుపులేటి సరస్వతి (68)ని ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పీక కోసి హత్య చేశారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త వెంకటేశ్వరరావు మొదటి సంబంధానికి ఒక కుమారుడు ఉన్నారు. ఈమె భర్త వెంకటేశ్వరరావు గతంలోనే మృతి చెందాడు. ప్రస్తుతం సరస్వతి ఇంటిలో ఒక్కటే నివాసం ఉంటోంది. మృతురాలి చిన్న కుమార్తె

ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

తులసి ఉషారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేపల్లె పట్టణ సిఐ మల్లికార్జునరావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని రేపల్లె డీఎస్పీ ఆవల శ్రీనివాసరావు పరిశీలించి చుట్టుపక్కల వారిని విచారించారు. బాపట్ల నుంచి క్లూస్ టీమ్ రప్పించి ఆధారాలు సేకరించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య జరిగి ఉండవచ్చునని ఫిర్యాదు అందినట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు.

2003 డీఎస్సీ అభ్యర్థులకు

పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలి

కృష్ణా, గుంటూరు జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

2003 డీఎస్సీ అభ్యర్థులకు తప్పనిసరిగా పాత పెన్షన్ స్కీమ్ కల్పించాలని కృష్ణా, గుంటూరు జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్లో డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మోపిదేవి శివశంకరరావు అధ్యక్షతన 2003 ఉపాధ్యాయుల సమస్యపై సమావేశం జరిగింది. సుమారు 500 మందికి పైగా డీఎస్సీ 2003 అభ్యర్థులు పాల్గొన్న ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాములో పిడిఎఫ్ ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57 ప్రకారం 2003 డిఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీమతి జానకిని కలిసి 2003 అభ్యర్థుల పాత పెన్షన్ అమలు చేయాలని కోరామని అన్నారు. ఓపిఎస్ విధానం వచ్చేవరకు పోరాటంలో భాగస్వామ్యం అవుతామని, ఉద్యమాలలో సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన తెలిపారు. రేపు రాబోయే శాసనమండలి సమావేశాలలో ప్రస్తావన తెస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలుగుదేశం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెలుగుదేశం రాష్ట్ర కార్యాలయం ఇన్చార్జి ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకష్ణ, తదితరులు పాల్గొని ప్రసంగించారు. 11 వేల మందికి పైగా పాత పెన్షన్ ఇవ్వాల్సి ఉన్నా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ, ఫోరం కన్వీనర్ ఎం.గురు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం సరళ సుశీల మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

సరళ సుశీల (ఫైల్)

మార్కాపురం పట్టణానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఆర్. సరళ సుశీల (80) హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మార్కాపురం పట్టణంలోని జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. ఆమె భర్త పులుకూరి జయరావు ఆర్అడ్‌బి శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు.

వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేటపాలెం

ఉచిత వైద్య శిబిరం సేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని లత హాస్పిటల్ డాక్టర్స్ రాజ్ కుమార్, శేఖర్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పందిళ్ళపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించారు. పలువురుని చికిత్స కోసం వైద్యులు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్స్ మాట్లాడు తూ లత హాస్పిటల్ అత్యంత శ్రద్ధతో, అతి తక్కువ ధరలతో నిరుపేదలకు వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో పని చేస్తుందన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-వేమూరు

అమృతలూరు మండలం, పాంచలవరం గ్రామానికి చెందిన కొమరబత్తిని ప్రమీల రాణి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అందజేశారు. ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2,14,934/- చెక్కును ప్రమీల రాణి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

బహుమతి అందుకుంటున్న వందన

చేతిరాత పోటీలో తృతీయ బహుమతి

ప్రజాశక్తి-మార్టూరు

గుంటూరు హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి చేతిరాత పోటీలలో మార్టూరుకు చెందిన ఓ విద్యార్థిని తృతీయ బహుమతి కైవసం చేసుకుంది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ విభాగాలలో దాదాపు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో భాగంగా బాపట్ల జిల్లా నుంచి నలుగు విద్యార్థులు పోటీలో పాల్గొనగా లెవెల్ -4 సీనియర్ విద్యార్థుల విభాగంలో మార్టూరు మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని జంగ్రాజు పల్లి ప్రైజీ వందన మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. పోటీలో రాష్ట్రస్థాయి అవార్డుతో పాటు వెయ్యి రూపాయల నగదు బహుమతిని అందుకున్న తమ పాఠశాల విద్యార్థిని ప్రైజీ వందనను ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీ జాయ్, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు మాలంపాటి శారదను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తుి వేమూరు

వేమూరు గ్రామంలో పెదకాకాని గుంటూరుకు చెందిన శంకర కంటి వైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు ఆధ్వర్యంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ శంకర్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేయడమే కాక అవసరమైన వారికి శాస్త్ర చికిత్సలు కూడా చేయడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసేందుకు కృషి చసిన విజయబాబును ఆనందబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల వైద్యులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు నాశనం

కలెక్టర్ తమీమ్ అన్సారియా

మాదక ద్రవ్యాల నియంత్రణపై 5కె రన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాదక ద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. క్యాన్సర్‌పై అవగాహన, మాదకద్రవ్యాల నివారణపై రైజ్ కృష్ణసాయి ఇంజినీరింగ్ కళాశాల, టెక్ బుల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఒంగోలు నగరంలో మారథాన్ 5కె రన్ 2025 నిర్వహించారు. స్థానిక మినీ స్టేడియం వద్ద ప్రారంభమైన ఈ పరుగు మిరియాల పాలెం వద్ద యూ టర్న్ తీసుకోని తిరిగి మినీ స్టేడియం వద్ద ముగిసింది. ఈ పరుగులో విజేతలుగా నిలిచిన పురుషులు మరియు మహిళలకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలను కలెక్టర్, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బీఎన్ విజయకుమార్ అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహనతో పాటు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ దిశగా ర్యాలీ ఏర్పాటు చేసిన నిర్వాహకులను, ఇందులో పాల్గొన్న యువతను కలెక్టర్ అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ క్షణకాల సంతోషం కోసం డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు బానిసలై నూరేళ్ల జీవితంలోని వెలుగును దూరం చేసుకోవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఎస్పీ చెప్పారు. ఈ రన్‌లో పాల్గొన్న యువతి, యువకులు ప్రజలకు క్యాన్సర్, మత్తు పదార్థాల నియంత్రణ, హెల్మెట్‌పై అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ నేటి యువత ఎక్కువగా ఒత్తిడికి లోనవుతోందని, దీన్ని అధిగమించేందుకు సరైన జీవన శైలిని అలవర్చుకోవాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ కాపా అనిల్ కుమార్, డాక్టర్ ఏ.శ్రీనివాసరావు, రైజ్ కాలేజీ ఎండీ భరత్, టెక్‌బుల్స్ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, రైజ్ సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ శిద్దా హనుమంతరావు ఒంగోలు తాలూకా ఒకటో పట్టణ సిఐలు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

ఆదర్శ నాయకుడు గుంజి వెంకట్రావు

సీపీఎం సీనియర్ నేతకు ఘన నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

క్రమశిక్షణ, కమ్యూనిస్టు విలువలను చివరిదాకా ఆచరించి ఆదర్శనీయంగా నిలిచిన వ్యక్తి కామ్రేడ్ గుంజి వెంకట్రావు అని ఆయన ఆశయాలను కొనసాగించటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం అద్దంకిలోని పోతురాజు గండి వద్ద సిపిఎం అద్దంకి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుంజి వెంకట్రావు సంతాప సభ జరిగింది. సిపిఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభలో రిమ్స్ డాక్టర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ గుంజి వెంకటరావు మరణానంతరం తన పార్థీవ దేహాన్ని సమాజహితం కోసం రిమ్స్‌కు దానం చేయడం అభినందనీయమన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్దయ్య, జాల అంజలి మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగ విరమణ అనంతరం వెంకట్రావు కమ్యూనిస్టు జెండాను చేతబట్టి కార్మిక వర్గ హక్కుల కోసం వారి పక్షాన ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మహాసభలు మూడు రోజులు పాటు అద్దంకిలో ఘనంగా నిర్వహించడంలో గుంజు వెంకట్రావు కృషి ఎంతో ఉందన్నారు. వయసు రీత్యా ఆయన ఉద్యోగ విరమణ చేసినప్పటికీ అన్ని వయసుల వారితో ఎంతో స్నేహంగా కొనసాగే వారిన్నారు. ఆయన లేని లోటు అద్దంకి ఉద్యమానికి తీరని లోటు అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందర్ మాట్లాడుతూ ఎర్రజెండా ఎత్తుకొని సుదీర్ఘ కాలం పాటు సాగించిన జీవన ప్రయాణాన్ని ఎర్రజెండాను కప్పుకొని జీవితాన్ని ముగించారని, సమస్యలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని వెంకట్రావు లాంటి ఉద్యమకారులు ఎర్రజెండాను మోస్తూనే ఉంటారన్నారు. వెంకట్రావు కుమార్తె శారద మాట్లాడుతూ తన తండ్రి చిన్నప్పటి నుంచి సమాజం పట్ల ప్రేమను బాధ్యతను గుర్తు చేస్తూనే ఉండేవారని, కమ్యూనిస్టు పార్టీ పట్ల సంపూర్ణమైన అభిమానం మాకు ఉందన్నారు. అది మా తండ్రి వెంకట రావు నుంచే వచ్చిందని భవిష్యత్తులోనూ పార్టీకి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మొండ్రు ఆంజనేయులు, కె.రఘుచంద్, బి.విజయ్ కుమార్, పొనక రామాంజనేయులు, గంగాధర్ పిటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంజి వెంకట్రావుకు నివాళులర్పిస్తున్న నేతలు

ఖోఖో ప్రపంచకప్‌లో సత్తా చాటిన

క్రీడాకారుడు శివారెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి-పంగులూరు

ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక క్రీడాకారుడు, పంగులూరులోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందిన శివారెడ్డిని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. మంత్రి గొట్టిపాటిని శివారెడ్డి ఆదివారం చిలకలూరిపేటలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో నుంచి ప్రపంచకప్ లాంటి ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్లో పాల్గొని బంగారు పతకం సాధించటం ఆంధ్ర రాష్ట్రానికి ప్రకాశం జిల్లాకు గర్వకారణం అన్నారు. శివారెడ్డిని ఆదర్శంగా తీసుకొని రానున్న రోజుల్లో యువత కూడా ఇటువంటి విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ఘనంగా సత్కరించారు. శివారెడ్డి మంత్రి గొట్టిపాటికి, ఎన్డీఏ ప్రభుత్వానికి, ఆంధ్ర ఖోఖో అసోసియేషన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



శివారెడ్డిని అభినందిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ముండ్లమూరు: ఖోఖో క్రీడలో తొలి వరల్డ్‌కప్‌లో తన ప్రతిభను చూపి భారతదేశానికి కప్ తీసుకొచ్చిన శివారెడ్డిని మండలంలోని ఈదర గ్రామంలో ఆదివారం డివైఎఫ్ఐ నాయకులు కేవీ పిచ్చయ్యచ, ఆర్‌జెసి పాల్.షేక్ నాయబ్ రసూల్, నాగేశ్వర రావు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడారంగంలో యువత చురుగ్గా పాల్గొంటున్నారని ప్రపంచ కప్ తీసుకురావడంలో ప్రథమ పాత్ర పోషించిన ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన వ్యక్తి శివారెడ్డి మన గ్రామం వాడు కావడం గర్వంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాకారులని ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వాలు కూడా క్రీడల్ని, క్రీడాకారుల్ని ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి శివారెడ్డిని డివైఎఫ్ఐ నాయకులు అభినందించారు.

అన్నదానానికి సహకరించాలి

కాకతీయ కమ్మ సేవా సమితి అన్నదాన కమిటీ సమావేశం

ప్రజాశక్తి-అద్దంకి

సింగరకొండలోని కాకతీయ కమ్మ సేవా సమితి అన్నదాన సత్రంలో తిరునాళ్ల సందర్భంగా నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చాగంటి రాజేంద్ర కోరారు. ఆదివారం అన్నదానం సత్రం కమిటీ సమావేశం జరిగింది. తిరునాళ్ళలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మార్చి 14వ తేదీన సింగరకొండ తిరునాళ్ల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడానికి తాత్కాలిక కమిటీ ఎన్నిక చేశారు. ఈ తాత్కాలిక కమిటీలో అధ్యక్షులుగా సందిరెడ్డి శ్రీనివాసరావు సభ్యులుగా దేవినేని శివయ్య, మాగులూరి సోమేశ్వర రావు, కాటా అంజయ్య, మల్లాది శ్రీనివాసరావు, బోడెంపూడి రామ మోహన్ రావు, నర్రా గోపాల్ రావు, రావి శ్రీధర్, మురళీ, పొడపాటి కృష్ణా రావు, నరిశెట్టి రమేష్, గుళ్లపల్లి సుబ్రమణ్యం, తెలప్రోలు శ్రీనివాసరావు, కొండ్రగుంట హనుమంతరావు, కమ్మ శ్రీనివాసరావు (మిలిటరీ) ఎన్నుకున్నారు. వీరి ఆధ్వర్యంలో సింగరకొండ తిరునాళ్లలో కమ్మ సత్రంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, కావున అందరం కలిసి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, మానం మురళీ మోహన్ దాస్, గోరంట్ల శివాజీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్పీ దామోదర్

క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయిస్తున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం, నాయుడుపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తులకు సాయం అందించి.. జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై టంగుటూరు వైపు ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు, అదే దిశగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అదే మార్గంలో ప్రయాణిస్తున్న ఎస్పీ ప్రమాదాన్ని గమనించి.. సంఘటనా స్థలానికి వచ్చారు. తమ వాహనాన్ని ఆపి గాయపడిన వారికి సహాయం అందించారు. ఆ సమయంలో తాలూకా హైవే మొబైల్ ఉంది. అంబులెన్స్‌కు కాల్ చేసి ప్రథమ చికిత్స చేయించడంతో పాటు, బాధితులను సమీప ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రమాదానికి కారణమైన కారును నడిపిన వ్యక్తిని తనిఖీ చేయించి, అతడు మద్యం సేవించి వాహనం నడిపినట్లు నిర్ధారణ కావడంతో, సంబంధిత అధికారులకు అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సకాలంలో గాయపడిన వ్యక్తులను వెంటనే అంబులెన్స్‌లో పంపించి.. మానవత్వాన్ని చాటుకున్న ఎస్పీ దామోదర్‌ని స్థానికులు అభినందించారు.

పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం..

సిపిఎం నేత 'పుల్లయ్య' కృషి

- పేదలకు అండగా కడ వరకూ పోరాడారు..
- ఘనంగా నివాళులర్పించిన నాయకులు

పుల్లయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మార్కాపురం

పీడిత ప్రజలకు అండగా నిలబడటమే కాకుండా వెనుకబాటులో ఉన్న పశ్చిమ ప్రకాశం అభివృద్ధి కోసం ఉద్యమించిన వ్యక్తి సిపిఎం నేత ఏనుగుల పుల్లయ్య అని పలువురు కొనియాడారు. పుల్లయ్య 16వ వర్ధంతి కార్యక్రమం స్థానిక కోర్టు సెంటరులోని హెడ్ పోస్టాఫీసు వద్దగల ఏనుగుల పుల్లయ్య స్తూపం వద్ద ఆదివారం నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డికెఎం రఫి అధ్యక్షతన జరిగిన పుల్లయ్య వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.సోమయ్య, సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్యతో పాటు ఇతర ప్రజాసంఘాల నాయకులు, పుల్లయ్య అభిమానులు పాల్గొన్నారు. ముందుగా పుల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం అభివృద్ధి కోసం కడవరకు పోరాడారన్నారు. పశ్చిమ ప్రాంత అభివద్ధికి వెలిగొండ ప్రాజెక్టు ఒక్కటే మార్గమని ప్రజలను కదిలించారన్నారు. త్వరగా పూర్తి కావాలని ఉద్యమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పుల్లయ్య పనిచేశారన్నారు. కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేశారన్నారు. పుల్లయ్య పోరాటాలతో ఎందరో పేదలకు గూడు దక్కిందన్నారు. భూ పోరాటాలు నడిపించారన్నారు. విద్యార్థి, యువజనుల కోసం పోరాటాలు నడిపిన చరిత్ర పుల్లయ్యదేనన్నారు. పేద ప్రజలే తన కుటుంబంగా భావించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి రూబెన్, జవ్వాజి రాజు, ఏనుగుల సురేష్‌కుమార్, ఏనుగుల రవి కుమార్, షేక్ నన్నేషా, కాశయ్య, మల్లికార్జున, ఓర్సు అడివయ్య, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఓ వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, బి.శ్రీరాములు, పి.ప్రభాకర్, కె.గౌతమ్, సిఐటియు నాయకులు కె సుబ్బరాయుడు, నాగరాజు, చెన్నకేశవులు, షేక్ సలాం ఖాన్, యు.వెంకటరావు, గోరంట్ల చిన్న వెంకటరెడ్డి, బొమ్మిరెడ్డి శంకరరెడ్డి, కె.నాగమురళి, ఏనుగుల శివ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

గణిత పరీక్ష పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మార్కాపురం

అబాకస్-వేదిక్ గణిత పరీక్షా పోటీల్లో మార్కాపురం పట్టణంలోని జిఎంఆర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో విజయవాడలో జరిగిన ఈ పోటీల్లో విజేతలుగా జిఎంఆర్ హైస్కూల్ విద్యార్థులు నిలవడం గమనార్హం. వివిధ విభాగాల్లో జరిగిన అబాకస్ మరియు వేదిక్ గణిత పోటీ పరీక్షలలో రెండో తరగతి విద్యార్థి పివి అర్జున్ సత్తా చాటారు. దీంతో రేజింగ్ స్టార్ అవార్డును సొంతం చేసుకున్నారు. నిర్వాహకుల చేతుల మీదుగా అర్జున్ మెమోంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి పి.అభినాథ్, 4వ తరగతి విద్యార్థి ఎస్.లోకేష్‌కు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందాన్ని, విజేతలను ఆ స్కూల్ కరస్పాండెంట్ జివి మల్లికార్జునరెడ్డి ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మేజర్ పంచాయితీ పరిధిలో గల 565 మాచర్ల-మార్కాపురం జాతీయ రహదారిపై ఎస్ఐ చౌడయ్య ఆధ్వర్యంలో పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, నాటుసారా, మద్యం వంటి అక్రమ రవాణా అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎవరైతే వాహనదారులు మోటారు వాహన చట్టమును అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులతో పాటు సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు జరిమానాలు విధించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో సోమవారం ఊరచెరువు, సమైక్యతానగర్, కొత్త మార్కెట్ తదితర ప్రాంతాలలో ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుదని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సిద్దెనపాలెం సర్వే నెంబర్ 296పై విచారణ

విచారణ చేస్తున్న తహశీల్దార్ చిరంజీవి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలోని ఐటీవరం రెవెన్యూ పరిధిలోని 296 సర్వే నెంబర్ మండల ఎఫ్ఏసి తహశీల్దార్ కె.చిరంజీవి ఆదివారం విచారణ చేపట్టారు. సిద్దెనపాలెం గ్రామ సర్వే నెంబర్ 296 సర్వే నెంబర్‌లోని ఎకరాలు 8.32 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన గడ్డం సుబ్బయ్య, కొల్లి వీరబ్రహ్మయ్య తమ పేర్లతో మోసపూరితంగా ఆన్‌లైన్ చేయించుకొని యర్రగొండపాలెంలోని సహకార బ్యాంకులో రుణం పొందారు. ఈ విషయంపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో గడ్డం సుబ్బయ్యపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించిన విషయం విదితమే. అక్రమ ఆన్‌లైన్ చేసిన విఆర్వో, డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సదరు విషయంపై వెంటనే విచారణ చేసి పూర్తి నివేదికను 9వ తేదీ సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఎఫ్ఏసీ తహశీల్దార్ చిరంజీవిని ఆదేశించారు. దీంతో సర్వే నెంబర్ 296పై తహశీల్దార్ చిరంజీవి సిబ్బందితో ఆదివారం విచారణ చేపట్టారు. విచారణ రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు.

చెస్‌లో జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు
- జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన ఏఎస్పీ నాగేశ్వరరావు, డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చదరంగంలో నైపుణ్యాలు పెంపొందించుకొని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు హైదరీ క్లబ్‌లో ఆదివారం రతన్ టాటా మెమోరియల్ ప్రకాశం జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు. తొలుత దేశం గర్వించదగిన ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా చిత్రపటానికి ఎమ్మెల్యే దామచర్ల పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టోర్నమెంట్‌కు జిల్లావ్యాప్తంగా వచ్చిన 128 మంది క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని చెస్‌లో అభివృద్ధి చెందాలని కోరారు. ఒంగోలు నగరంలో జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. అదనపు ఎస్‌పి(అడ్మిన్) కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధస్సుతో ఆడాలని, ప్రత్యర్థి వ్యూహాలను అర్థం చేసుకుంటూ పావులను కదుపుతూ విజయం సాధించాలన్నారు. ఇందుకు మంచి ఏకాగ్రత అవసరమని, జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల, ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు చెస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో హైదరీక్లబ్ వైస్ ప్రెసిడెంట్ చంద్రమోహన్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త, సూర్యశ్రీ వికలాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకృష్ణ, ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ కాపా అనిల్‌కుమార్, టిడిపి నాయకులు బండారు మదన్ ,పాటిబండ్ల సుధాకర్ బాబు, టోర్నమెంట్ నిర్వాహకులు కందుల కోటి, జెకె రాజు, శ్రీకాంత్ పూసపాటి, బుజ్జి పాల్గొన్నారు.

కవి వెంకటేశ్వర్లుకు ఘన నివాళి

పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక ఒంగోలులోని మల్లయ్య లింగం భవనం ఆవరణలో ఆదివారం ఉదయం పది గంటలకు కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, విశ్రాంత హిందీ అధ్యాపకులు, 'సాహిత్యరత్న' పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సభకు కళామిత్రమండలి(తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కృషి, పట్టుదల ఉంటే వయస్సుతో సంబంధం లేకుండా రచనలు చేయడం పెద్ద కష్టమేమీ కాదని నిరూపించిన వ్యక్తి పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు అని గుర్తు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, సహజ కవి శనగపల్లి సుబ్బారావు, బాల సాహితీవేత్త మద్దిరాల శ్రీనివాసులు, ఆళ్ళచెరువు సాంబశివరావు, వి.యన్. సుబ్రమణ్యేశ్వరశర్మ మాట్లాడారు. సభానంతరం ఆయన సతీమణి పబ్బిశెట్టి సత్యవతి, మనవడు కార్తీక్ వారి కుటుంబసభ్యులు, నిర్వాహకులు వివిధ రంగాల్లో కృషి చేస్తున్న ప్రముఖులను ఘనంగా సత్కరించారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని కట్టసింగనపాలెం గ్రామానికి చెందిన షేక్ మౌలాబి జ్ఞాపకార్థం దర్శి, కురిచేడు రోడ్డులోని శ్రీషిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం అన్నదానం, పండ్లు, మిఠాయిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారి కుమారులు షేక్ పెద్దఖాసీం, షేక్ చిన్నఖాసిం, మనవళ్లు షేక్ ఖాసిం, సైదా, షేక్ ఆసిఫ్, షేక్ అక్బర్‌బాషా, చిన్నకాసిం, జాన్, సైదా, మనవరాలు జాస్మిన్, హసీనా, నిర్వాహకులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

సత్రం పనులు ప్రారంభం

ప్రజాశక్తి-తాళ్లూరు

మండలంలోని గుంటిగంగ వద్ద మాలల సత్రంకు స్లాబ్ వెయ్యడానికి ప్రకాశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యులు, వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పనులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సత్రం నాయకులు దారా అంజయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖోఖో విజేతను అభినందించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

ఖోఖో క్రీడాకారునికి అభినందన

ప్రజాశక్తి-దర్శి

ముండ్లమూరు మండలంలోని ఈదర గ్రామానికి చెందిన పోతిరెడ్డి శివారెడ్డి ఖోఖో ప్రపంచ కప్ సాధించడంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విషయం పాఠకులకు విధితమే. తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యువ నాయకులు డాక్టర్ లలిత సాగర్ ప్రపంచ కప్ విజేత శివారెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో శివారెడ్డి కుటుంబ సభ్యులు, జనసేన అధ్యక్షుడు సీదా రామకృష్ణ పాల్గొన్నారు.

శుభకార్యక్రమాల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

చిన్నారిని దీవిస్తున్న బూచేపల్లి

వైసిపి కార్యకర్త పంటా సుబ్బారెడ్డి కుమార్తె ఫంక్షన్‌కు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శాసన సభ్యులు, వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. 1వ వార్డు కౌన్సిలర్ జగన్నాథం మోహన్‌బాబు కుమార్తె నామకరణం వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమాలలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామిక కారిడార్‌కు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - దొనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు తాండవ రంగారావు

గతంలో 2014 అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటించిన దొనకొండ పారిశ్రామిక కేంద్రంకు 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి పరిశ్రమలకు అనువుగా మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వమే పరిశ్రమలు స్థాపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. సీపీఎం మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సీపీఎం నాయకుడు చిరుపల్లి అంజయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ దొనకొండ ప్రాంతం రాష్ట్రంలోనే ఎంతో వెనుకబడిన ఉందని అన్నారు. ఇక్కడ ప్రజలకు పనులు లేక ఉపాధి, ఉద్యోగాల కోసం నిత్యం వలసలు వెళ్లటం తప్పడం లేదన్నారు. శ్రీకృష్ణ కమిటీ ప్రకారం దొనకొండలో 25వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, రాజధానిని ఇక్కడ ఏర్పాటు చేయాలని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 మొదటి అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబు దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేస్తామని, నా బార్డు నిధులతో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని, ప్రజలకు ఉపాధి కల్గేలా అభివృద్ధి చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఫలితంగా 15 దేశాల అధిపతులు అనేక రాష్ట్రాల ఉన్నతాధి కారులు ఈ ప్రాంతంలో పర్యటనలు చేసి పరిశీలించారేగాని ఒక్క పరిశ్రమ స్థాపనకు ముందుకు రాలేదన్నారు. ప్రభుత్వం స్వంతంగా పరిశ్రమలు ప్రారంభించలేదని అన్నారు. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యేలు పరిశ్రమల అధిపతులైనప్పటికీ వారైనా పరిశ్రమలను స్థాపించి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించ లేదని విమర్శించారు. మళ్లీ అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీల అమలుకోసం ఈ ఏడాది కారిడార్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి మౌళిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు దొనకొండ కారిడార్‌ను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. దొనకొండ కారిడార్ ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు అమలు కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు, ప్రచారాలు ముమ్మరంగా చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుందుర్తి చిన్ననర్శింహులు, కోలా కిరణ్‌కుమార్, మేళం ఉదయ్, అంజిబాబు, యరగుంట్ల నతాన్ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో 'వద్దిమడుగు'

ప్రజాశక్తి-కొనకనమిట్ల

పిచ్చి చెట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్

మండలంలోని వద్దిమడుగు పంచాయితీలో సమస్యలు తిష్టవేశాయి. అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గతంలో నిర్మించిన సిమెంట్ రోడ్లు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు లేకపోవడంతో ఇళ్లల్లోని వృధా నీరు నడిరోడ్డుపై పారుతుంది. గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. నాటి నుండి నేటి వరకు నీరు సక్రమంగా సరఫరా జరిగిన దాఖలాలు లేవని గ్రామస్తులు అంటున్నారు. 10 రోజులకు ఒకసారి సాగర్ నీరు సరఫరా అవుతున్నాయని తెలిపారు. ఈ నీరు గ్రామస్తులకు పూర్తి స్థాయిలో సరిపోక దూర ప్రాంతాలకు వెళ్లి బోర్ల వద్ద నుండి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని పలువురు మహిళలు అంటున్నారు. దీంతో ట్యాంక్ లోపల బయట పిచ్చిచెట్లు అలుముకొని అపరిశుభ్రతగా ఉంది. వీధి దీపాలు పగలు, రాత్రికి తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీపాలు ఆపేందుకు ప్రత్యేక స్విచ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. పాత సచివాలయ బజారులోని మినీ ఓవర్ ట్యాంక్ వద్ద నీరు పోయేందుకు మార్గం లేక నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామం నుండి మండల కేంద్రానికి రావాలంటే కిలోమీటర్‌పైగా నడవాల్సిందే. ఈ రోడ్డు గతంలో అభివృద్ధి చేసేందుకు గుత్తేదారుడు రోడ్డును చదును చేసి ఆ రోడ్డుపై కంకరు వేసి వదిలేశారు. గ్రామం నుండి ఎదురాళ్లపాడు - వాగుమడుగు తారు రోడ్డు వరకు గల మట్టి రోడ్డును పలుసార్లు అభివృద్ధి చేసి బిల్లులు మార్చుకున్నారని, ఆ దారి బాగుపడిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వద్దిమడుగు చెరువు ఆయకట్టు కింద 660 ఎకరాలు భూమి ఉందని, చెరువులోని పూడికతీసి కట్టను అభివృద్ధి చేస్తే నీరునిల్వ ఉంటుందని, భవిష్యత్తులో ఆయకట్టు రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. ఆ దిశగా నూతనంగా ఎన్నికైన నీటి సంఘం అధ్యక్షులు, సభ్యులు చొరవ తీసుకొని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైడ్ కాలువలు లేక రోడ్డుపైనే ఇళ్లల్లోని వృధా నీరు

రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఎమ్మెల్యే దామచర్ల చొరవతో 20 ఏళ్ల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు చొరవతో ఒంగోలు నగరంలో గత 20 ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. కర్నూల్ రోడ్డు నుండి కొత్త కూరగాయల మార్కెట్ కు వెళ్లే సిమెంట్ రోడ్డు గత 20సంవత్సరాలుగా కోర్టు వివాదాలతో అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో ఒక్క రోడ్డు నుండి వచ్చే, పోయే వాహనదారులు, ప్రజల ఇబ్బందులను గమనించి సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు నిధులు మంజూరు చేశారు. ఆదివారం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న నక్కల వారితో మాట్లాడారు. నక్కల వాళ్ళు ఈ స్థలం ఖాళీ చేసి మీకు ఇచ్చిన చోట వ్యాపారం చేసుకొని ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. ఈ సందర్భంగా నాయన మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. రహదారి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. డివైడర్, ఎలక్ట్రికల్ షిఫ్టింగ్ పనులు కూడా త్వరగా పూర్తి చేసి వచ్చే వారానికి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే కోరారు. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు మదన్, డివిజన్ నాయకులు, కార్పొరేషన్ అధికారఋలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, డివిజన్ నాయకులు మరియ తదితరులు పాల్గొన్నడం జరిగినది.

షాపులు నిర్వహిస్తున్న నక్కల వారితో చర్చిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-దర్శి

గురుకుల పాఠశాల వార్షికోత్సవంలో సీఐ వై రామారావు

విద్యార్థులు క్రమశిక్షణతో అంకితభావంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీఐ వై రామారావు అన్నారు. స్థానిక డాక్టర్ అంబేద్కర్ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ ఎస్ మాధవరావు అధ్యక్షత వహించారు. సభలో సిఐ వై రామారావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ఎగ్జిక్యూటివ్ మెంబర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ముందుగా భారత 3వ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుసేన్‌ఖాన్ జయంతి సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్, డాక్టర్ జాకీర్ హుసేన్‌ఖాన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఐఆర్‌సిఎస్, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి కపురం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో మానసిక పరిపుష్టి కోసం పెద్దల సలహాలు, సూచనలు తీసుకుని మానసిక ధృఢంగా ఉండాలని అన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు, మీ గ్రామాలకు మంచి పేరు తెచ్చేవిధంగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, స్థానిక మీనాక్షి హాస్పిటల్స్ డాక్టర్ పోతిరెడ్డి, వెంకారెడ్డి (అసిస్టెంట్ ప్రొఫెసర్ జీజీహెచ్, ఆంకాలజీ విభాగం) తనివి తీరా తన పాత మధుర జ్ఞాపకాలను విద్యార్థులతో పెంచుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ యేసు రత్నం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- చీరాలలో 100 పడకల వైద్యశాల అభినందనీయం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- అట్టహాసంగా గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-చీరాల

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపేట వేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. చీరాల ప్రాంతంలో తొలిసారిగా 100 పడకలతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి గొట్టిపాటి రవి కుమార్, నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో కలిసి ఆదివారం హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాలలో నూతనంగా నిర్మించిన గోరంట్ల సూపర్ స్పెషాలిటీ 100 పడకల హాస్పిటల్ ప్రారంభోత్సవం జరగటం చీరాల ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆధునిక వైద్య సౌకర్యాలతో కూడిన హాస్పిటల్‌ను ఏర్పాటు చేసిన హాస్పిటల్ ఎండి డాక్టర్ గోరంట్ల రాజేష్ సేవలు అభినందనీయమన్నారు. ప్రజలకు సేవచేసే దృక్పథంతో ముందుకొచ్చే ప్రైవేట్ ఆసుపత్రులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా పోత్సహిస్తుందన్నారు. గోరంట్ల హాస్పిటల్ వైద్యులు పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో కూడిన వైద్యసేవలందించి అన్ని వర్గాల ప్రజల మన్ననలు అందుకోవాలని ఆకాంక్షించారు. గత వైసీపీ ప్రభుత్వం వైద్య రంగాన్ని అన్ని విధాలా నిర్వీర్యం చేసిందన్న మంత్రి గొట్టిపాటి ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చిందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గోరంట్ల రాజేష్ మాట్లాడుతూ చీరాల పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలనే తలంపుతో గోరంట్ల హాస్పిటల్‌ను మరింతగా విస్తరించి ఆధునిక వైద్యసేవలతో అనుభవవంతులైన వైద్య బృందంతో ముందుకొచ్చామన్నారు. పేద, సామాన్య ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యసేవలను సైతం 24 గంటలు అందిస్తామన్నారు. ఇదే క్రమంలో చిన్నపాటి సమస్యలకు ఇకపై గుంటూరు, విజయవాడ వెళ్లే పని లేకుండా అనువజ్ఞులైన చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ శ్రావణి, ఎముకులు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ చైతన్య, గర్భిణీ స్త్రీల, గర్భకోశ వ్యాధుల వైద్యులు డాక్టర్ ప్రీతి, గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుబ్బారావు, మెదడు, నరాల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీజిత్ కూడిన వైద్య బృందం ఆసుపత్రిలో నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. చీరాల పరిసర ప్రాంతాల ప్రజలు గోరంట్ల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం హాస్పటల్లోని పలు విభాగాలను మంత్రి, ఎమ్మెల్యే కొండయ్య పరిశీలించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ భవాని ప్రసాద్, చీరాల బ్రాంచ్ అధ్యక్ష్య, కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పి.శ్రీకాంత్‌లతో పాటుగా సీనియర్ వైద్యులు, ప్రముఖులు, ఐఎంఎ వైద్యులు ప్రారంభోత్సవానికి హాజరై హాస్పటల్ యాజమాన్య బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

హాస్పిటల్‌లో సౌకర్యాలు పరిశీలిస్తున్న మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే కొండయ్య, సిబ్బంది

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరులోని స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు రోటరీ సభ్యుడు దోప్పలపూడి శేషుబాబు, రామాంజమ్మ కుమారుడు ప్రసన్న భాను పుట్టినరోజు సందర్భంగా భోజనాలు, పండ్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, నాగభైర శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, శేషుబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-వేమూరు

ప్రభుత్వం విద్యా వవస్థలో అమలు చేస్తున్న అనేక రకాల పథకాలు, వాటి పనితీరును వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై కూడా ఆయన సమీక్షించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం పనితీరు మరియు హాజరు శాతం, త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల పట్ల తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ ఏర్పాట్లు వంటి అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు, కొల్లూరు, అమృతలూరు, చుండూరు, వేమూరు మండలాల విద్యాశాఖ అధికారులు నీలం దేవరాజు, ఐ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు రాబట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బిఎన్.విజయకుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించినప్పటికీ కేంద్రం ప్రకటించిన బడ్జెట్లో జిల్లా గురించి ప్రస్తావన లేనందున జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని సిపిఎం నేతలు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లాలోని కొంత భాగాన్ని, గుంటూరు, కర్నూలు జిల్లాలలోని కొంత భాగాలను కలిపి 1970లో ప్రకాశం జిల్లా ఏర్పడిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల పునర్విభజనతో 38 మండలాలతో ప్రకాశం జిల్లాగా ఏర్పడ్డాక.. జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తారని ప్రజలు ఆశించినా అమలు కాలేదన్నారు. జిల్లా ఏర్పడి 54 ఏండ్లు గడిచినా కరువు కాటకాలతో వెనుకబడి వుందన్నారు. ఫ్లోరిన్ నీటితో గొంతు తడుపుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులలో దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్, సియస్.పురం సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఫుడ్, ఆక్వా, వెజిటబుల్ ప్రాసెస్ యూనిట్లు, లెదర్ ప్రాసెస్ యూనిట్లను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని సూచించారు. కొత్తపట్నం హార్బర్ నిర్మాణంతో పాటు, రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా నిర్మాయకొండ మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. అమూల్ సంస్థకు అప్పగించిన ఒంగోలు డెయిరీని యన్.డి.డి.బి ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని సూచించారు. యర్రజర్ల ఇనుప ఖనిజ భూములను విశాఖ ఉక్కు పరిశ్రమకు కేటాయించే విధంగా ఒత్తిడి తేవాలని కోరారు.

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు పూర్తి చేసి దొనకొండ- ఒంగోలు, గిద్దలూరు, బ్రాక రావుపేట రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని కోరారు. శింగరాయకొండ నుంచి కనిగిరి, మార్కాపురం మీదుగా శ్రీశైలంకు కొత్త రైల్వేలైను మంజూరుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో కోస్టల్ కారిడార్ ఏర్పాటుకు తోడ్పడాలని సూచించారు. ఐదు నియోజకవర్గాల ప్రజలకు సాగు, తాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తిచేసి 2025 వరద సీజన్ నాటికి నీరు అందించాలన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ చెల్లించాలని, పి.సి.పల్లి, మర్రిపూడి మండలాలను ప్రాజెక్టు పరిధిలోకి చేర్చాలని కోరారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు మరమ్మత్తులు చేయడంతో పాటు, అర్ధంతరంగా నిలిచిపోయిన సంగమేశ్వరం రిజర్వాయర్ పనులు ప్రారంభించాలన్నారు. పాలేటిపల్లి ప్రాజెక్టు స్పిల్వే పూర్తి అయినప్పటికీ పంటకాల్వలు నిర్మించవలసి ఉందన్నారు. మసిపల్లివాహక ప్రాంతానికి 2 టియంసీల సాగర్ నీరు విడుదల చేయాలని , జిల్లెలమూడి వద్ద పేరుకుపోయిన పి.బిఛానల్ లోని ఇసుక మేటను తొలగించాలన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలోని గుండ్లమోటు, చీతిరాళ్లకత్తువ చెక్ డ్యామ్‌లను పూర్తిచేయాలని కోరారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని కోటకట్టచెరువు, వరికసెలపూడి ప్రాజెక్టును నిర్మించాలని కోరారు.

ప్రతి కుటుంబానికీ సరిపడా తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దర్శి కేంద్రంగా పశ్చిమ ప్రాంతానికి తాగునీరు అందిస్తున్న స్కీములకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఒంగోలు, కనిగిరి, పొదిలి, చీమకుర్తి, గిద్దలూరు, దర్శి పెండింగ్ తాగునీటి పథకాలను పూర్తిచేయాలని సూచించారు. జలజీవన్ మిషన్ కింద మంజూరైన భారీ తాగునీటి స్కీముల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు రాబట్టాలన్నారు. ప్రజలను తాగునీటి కొనుగోలు భారం నుండి కాపాడాలని, 729 గ్రామాల్లో వున్న ఫ్లోరైడ్ నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్కాపురం మెడికల్ కాలేజిని ప్రభుత్వ మెడికల్ కాలేజీగా చట్టం చేయించి, నిలిచిపోయిన నిర్మాణ పనులు వేగవంతం చేసి 2025-26 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించేలా కృషి చేయాలన్నారు. దోర్నాల గిరిజన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని వెంటనే పూర్తిగా వినియోగించేందుకు చొరవ చూపాలన్నారు. జిల్లాలో వున్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు విస్తృత పరిచి, మందుల సరఫరా, మౌళిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు దోహదపడాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఆసుపత్రులలో ఉన్న ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కృషి చేయాలన్నారు. ఒంగోలులో ఇ.ఎస్.ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో వున్న డయాలసిస్ సెంటర్లలో ప్రత్యేక వైద్యులను నియమించి డయాలసిస్ యూనిట్లు పెంచాలన్నారు.

ఆంధ్రకేసరి ప్రకాశం యూనివర్సిటీకి నిధులు రాబట్టడంతో పాటు శాశ్వత భవనాలు నిర్మించి అన్ని కోర్సులు ప్రవేశ పెట్టడంతో పాటు, హాస్టళ్ల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో మౌళిక వసతులు మెరుగుపర్చాలని ,ట్రిపుల్ ఐ.టి కి సొంత భవనాల నిర్మాణానికి కృషి చేయాలన్నారు, జిల్లాలో జెఎన్‌టియుకు అనుభంధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా పునర్విభజనలో నూతనంగా ఏర్పడిన కనిగిరి రెవిన్యూ డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్, నవోదయ, కేంద్రీయ విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. చీమకుర్తిలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ప్రకాశం జిల్లా మౌళిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, వైద్యం, ఉపాధి కల్పించేందుకు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు ప్రభుత్వం ద్వారా రూ.10 వేల కోట్లు కేటాయించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ విషయంపై జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చిస్తామని హామీ ఇవ్వగా, మంత్రి గొట్టిపాటి రవికుమార్ అంశాన్ని దాట వేసే ప్రయత్నం చేశారు. అధికార ప్రతిపక్ష శాసనసభ్యులు సానుకూలంగా స్పందిస్తూ శాసనసభలో చర్చించి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, జిల్లాకు చెందిన మిగత శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు మెయిల్ ద్వారా వినతిపత్రాలు పంపించారు. ప్రజాప్రతినిధులను కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బి రఘురాం, జిల్లా నాయకులు తోట తిరుపతిరావు, ఎస్.స్వామిరెడ్డి ఉన్నారు.

మంత్రి చొరవతో దారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు మండలంలోని కొండమూరు గ్రామం పొలాల్లోకి వెళ్లే దారి సమస్య రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పరిష్కారం అయ్యింది. జాగర్లమూడి వారి పాలెం హైవేరోడ్‌కు తూర్పు వైపుగా సర్వీసు రోడ్డు నుండి కొండమూరు వైపు వెళ్లే పొలాలకు వెళ్లేందుకు దశాబ్దాలుగా, దారి సమస్య నెలకొని ఉంది. ఈనెల ఒకటో తేదీన ముప్పవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థానిక సమస్యలపై చేపట్టిన సమీక్షలో ఆ ప్రాంత రైతులు పొలాలకు వెళ్లేందుకు దారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఆ సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ దారి సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ మండల తహశీల్దార్ సింగారావును ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో సంబంధిత రైతులతో చర్చించి పొలాలకు చేరుకునే దారికి ఆటంకం లేకుండా, తహశీల్దార్ సింగారావు సమస్యకు పరిష్కారం చూపారు. రోడ్డు నిర్మాణానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. దీర్ఘకాలంగా ఉన్న దారి సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి గొట్టిపాటికి రైతుల కృతజ్ఞతలు తెలిపారు.

భూమి పూజ చేస్తున్న దృశ్యం

బలరాం కాలనీలో ఇంటిస్థలం ఇప్పించండి

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ బలరాంకాలనీలో అన ర్హులకు ఇళ్ల స్థలాలు కేటా యించారని, గజం భూమి లేని మాకు ఇంటి స్థలాలు ఇవ్వలేదని ఎలాగైనా మాకు న్యాయం చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు దేశాయిపేట చేనేత కుటుంబాలకు చెందిన నిరుపేదలు ఆదివారం మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ చట్టపరంగా ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లేళ్ల సోమశేఖర్, సజ్జ పాపారావు, కపిల్, వెంకట సుబ్బారావు, పేర్నేటి నాగరాజు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల వితరణ

ప్రజాశక్తి-పర్చూరు

బాపట్ల రోటరీ సభ్యుడు కొల్లా శ్రీనివాసరావు తన తండ్రి జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ పర్చూరుకు 12 సిమెంట్ బల్లలు ఆదివా రం అందజేశారు. వీటిని నాగులపాలెంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో ప్రయోజనాలు కల్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, రావి సత్యనారా యణ, కోట హరి ప్రసాదరావు, పాటోలు వెంకన్న, నాగభైరు శ్రీనివాసరావు, పాటోలు ఉదయభాస్కర్, పోలిశెట్టి చంద్రం, కొల్లా శివరామకృష్ణ ప్రసాద్, కొల్లా నరేంద్ర, రావి సతీష్ బాబు పాల్గొన్నారు.

గొట్టిపాటి సుబ్బాయమ్మకు నివాళి

ప్రజాశక్తి-యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడిలో జరిగిన తన నాయనమ్మ గొట్టిపాటి సుబ్బాయమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆదివారం రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యద్దనపూడి, మార్టూరు మండలాల నాయకులు మంత్రిని కలిశారు. వర్ధంతి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గొట్టిపాటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య సతీమణి పద్మ, కుమార్తె లక్ష్మీ, లక్ష్మి భర్త సాగర్, గొట్టిపాటి బాబి, నాయకులు పెరవలి శ్రీనివాసరావు, జి.వెంకటరావు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాప్రతినిధుల గళం

- పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి
- రహదారు మరమ్మతులకు చర్యలు చేపట్టండి
- సమస్యలు పరిష్కరించాలని మంత్రుల ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు సమస్యలపై గళమెత్తారు. ఆయా మండలాలోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, రహదారులకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులు పరిశీలించి పరిష్కార దిశగా రాష్ట్ర మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలు వారి మాటలల్లోనే...

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై అపోహలు వద్దు
- సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డిబివి స్వామి

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై ఎలాంటి అపోహలు వద్దు. స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకున్నాక ఫౌండేషన్, ప్రైమరీ మోడల్, మోడల్ స్కూల్, హై స్కూల్ ఏర్పాటు, కొనసాగింపు విషయంలో నిర్ణయం తీసుకుంటాం. పంచాయతీకి కేవలం ఒకటి మాత్రమే మోడల్ స్కూలు ఉంటుందనే అపోహ వద్దు. కనీసం ఒకటి ఉండాలనేది నిబంధన. అవసరాన్ని బట్టి ఒకటి కంటే ఎక్కువ మోడల్ స్కూల్స్ ఏర్పాటు విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. స్కూల్స్ లో డిజిటలైజేషన్ కొనసాగుతుంది. ఆయా పాఠశాలల్లో ఇంటర్నెట్, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం. అధికారులను ఆదేశించాం.

సూర్య ఘర్ పై విస్తృత అవగాహన
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

సూర్య ఘర్ పథకం లో భాగంగా సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు విస్తత అవగాహన కల్పించాలి. యర్రగొండపాలెంలోని గిరిజన ప్రాంతంలో విద్యుత్ సదుపాయం లేని 1700 నివాసాలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టింది. ఇప్పటికే 1000 గహాలకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. మిగతా గహాలకు విద్యుత్ లైన్ వేయడానికి అటవీ శాఖ అనుమతులు లేక సౌర విద్యుత్ వినియోగాన్ని బ్యాటరీ బ్యాకప్ ద్వారా స్థానికులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.

మండలాల్లో మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి
ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

మండలానికి ఒక మోడల్ స్కూలు కాకుండా విద్యార్థుల సంఖ్యను బట్టి పెంచాలి. స్కూల్స్ లో డిజిటలైజేషన్ కొనసాగించాలి. ఆయా పాఠశాలల్లో నెలకొన్న ఇంటర్నెట్, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి.

గర్ల్స్ హాస్టల్ నిర్మాణం పూర్తి చేయండి
ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

కరేడులో బి సి బాలికల హాస్టల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి. అసంపూర్తిగా హాస్టల్ నిర్మాణంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణం చేసే సమయంలో ఏజెన్సీ, అగ్రిమెంట్ చేసుకోవటం చెబుతున్నారు. కాంట్రాక్టర్ ఎవరో చెప్పటం లేదు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి
యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంచాలి. నాడు - నేడు పథకంలో గతంలో చేపట్టిన పెండింగ్ పనులను పూర్తి చేయాలి. యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం , పుల్లలచెరువు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ నిర్మాణ పనులపై అధికారులు దష్టి పెట్టాలి.

నాడు- నేడు అవకతవకలపై విచారణ
- కనిగిరి ఎమ్మెల్యే ఎం.ఉగ్రనరసింహారెడ్డి

గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన నాడు – నేడు పనులలో అవకతవకలు చోటు చేసుకున్నాయి. వీటిపై విచారణ చేయించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో స్కూల్స్‌లో పెట్టిన ఆర్వో ప్లాంట్‌లు పనిచేయటం లేదు. వాటికి మరమ్మతుల చేయాలి.

మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి
ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టల్ నిర్మాణానికి మినరల్ ఫండ్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

ప్యాచ్ వర్క్సలో నాణ్యతేదీ.?
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

కిమ్స్ హాస్పిటల్ నుంచి ఒంగోలు నగరంలోకి వచ్చే మార్గంలో ప్యాచ్ హెూల్స్ ఎక్కువగా ఉన్నాయి. వీటిని సత్వరమే పూడ్చేలా చర్యలు తీసుకోవాలి. చేపడుతున్న ప్యాచ్ వర్క్స నాణ్యత లేదు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.

మద్దిపూడి- పొదిలి రోడ్డుకు మరమ్మతులు
మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ

మద్దిపూడి నుంచి పొదిలి వెళ్లే రోడ్డు కూడా దెబ్బతింది. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. కొండపి నియోజకవర్గంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలి

శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనం
గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

కొమరోలు మండలం అల్లి నగర్ లోని బిసి హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. సమీపంలోని పాఠశాలలో అదనపు తరగతి గదిలోకి విద్యార్థులను తరలించే విషయాన్ని పరిశీలించాలి.

తప్పు చేసిన రేషన్ నిర్వాహకులపై చర్యలు
దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి

రేషన్ షాపుల నిర్వాహకులు తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలి. అలా కాకుండా అధికారులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు పెడుతున్నారు. ఇలాంటి ఉదంతాలపై దష్టి సారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

సమావేశాల్లో జోష్ పెంచాలి
- చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

జడ్పీ సర్వసభ్య సమావేశం చప్పగా సాగుతోంది. చర్చలలో జోరు పెంచాలి. గత ఐదేళ్ళు సమస్యలపై మాట్లాడటానికి అవకాశం దక్కలేదు. కూటమి ప్రభుత్వం జరుగుతున్న జడ్పీ సర్వసభ్య సమావేశాల చర్చలలో జోష్ పెంచాలి.

విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించండి

జడ్పీలో అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లాలో విద్యుత్ సమస్యలన్నీ వెంటనే పరిష్కారం చేయాలని, ప్రతి సభ్యుడు అడిగిన ప్రశ్నను రాసుకుని ఏం చేశామనేది వారికి సమాధానం కూడా పంపాలని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలను సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలో కరెంటు స్తంభాలు దెబ్బతిన్నాయని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలానికి రూ.25 లక్షలు చొప్పున కోటి రూపాయల నిధులు ఇవ్వాలని కోరారు. మంత్రి డోలా వీరాంజనేయస్వామి కూడా మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పథకంలో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ట్రూఅప్ ఛార్జీల పేరుతో వేలాది రూపాయల బిల్లులు ఇస్తున్నారని ఇలా ఎలా జరుగుతోందని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లును అడిగారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు కూడా పెరిగాయన్నారు. వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ అయ్యంబొట్లపల్లిలో పెద్దపోగు గురవయ్యకు విద్యుత్‌షాక్‌తో రెండు కాళ్లు దెబ్బతిన్నాయన్నారు. వైద్య ఖర్చులకు సాయం చేయాలని కోరారు. దీనిపై మంత్రి గొట్టిపాటి స్పందిస్తూ వైద్య సాయం చేయించాలని ఎస్ఈని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్‌శాఖ పరంగా తీసుకునే చర్యలను వివరించారు. ప్రమాదాలు జరుగుతు న్నాయని, బాధితులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెండింగులో ఉన్న వారికి పరిహారం ఇస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలతో పాటు వాటిని కొనేవాళ్లపై కేసులు పెట్టాలని ఆదేశించారు. సభ్యులు అడిగిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలిన ఎల్ఐసి ఏజెంట్లు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

చలో ఢిల్లీకి తరలుతున్న ఎల్ఐసి ఏజెంట్లు

ఎల్ఐసి లో కేంద్రం తలపెట్టిన సంస్కరణల ను వ్యతిరేకిస్తూఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసిఐఓయు) పిలుపుమేరకు ఏజెంట్ల బందం ఢిల్లీకి తరలివెళ్ళింది. ఎల్ఐసిఐఓయూ ఈనెల 11న ఢిల్లీలో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రకాశం జిల్లాకు చెందిన ఎల్ఐసి ఏజెంట్లు బెజవాడ శివయ్య, బి వెంకట సుజాత, పి వీర అంకమ్మ, పి మహేష్, సీఎం కొండయ్య, కే సత్యనారాయణ, జి లక్ష్మణ్ ఆదివారం ఉదయం ఒంగోలు నుంచి బయలుదేరి వెళ్లారు. జిల్లా ఏజెంట్ల బందానికి ఒంగోలు బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు రైల్వేస్టేషన్ లో ఘనంగా వీడ్కోలు పలికారు.

కేన్సర్ స్క్రీనింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ

- పుట్టుకతో వచ్చే లోపాలపై స్క్రీనింగ్ పరీక్షలు
- పోషకాహార లోపాల నివారణకు అవగాహన
- మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి
- డిఎంహెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు వెల్లడి



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె)లో జిల్లాలో 0–18 సంవత్సరాల లోపు పుట్టుకతో లోపాలున్న పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నాం. బంగారు బాల్యం కార్యక్రమంలో బాల్య వివాహాల నిర్మూలన, పోషకాహార లోపం నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే...

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ప్రత్యేక దృష్టి సారించాం. ఈ కార్యక్రమంలో జిల్లాలో 2024 నవంబర్ 24న ప్రారంభమైంది. ప్రతి రోజు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశ వర్కర్ ఐదు గృహాలు సందర్శించాలని లక్ష్యం నిర్దేశించాం. అనుమానిత కేసులు నమోదైతే వారు వైద్య, అధికారికి తెలియజేయాలి. అనుమానితులను పిలిపించి స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించి నిర్ధారణ అయితే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి తెలియజేయాలి. ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల(జిజిహెచ్)లో ప్రతి గురు, శనివారాలలో సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏ.కిషన్ బాబు ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో 7,64, 400 గహాలకు గాను 1,88,854 గహాలను సిబ్బంది ద్వారా సందర్శించాం. 18,47, 773 జనాభాకి గాను 5,32,212 జనాభాను సందర్శించి కేన్సర్ పరీక్షలు నిర్వహించాం. మొత్తం 3677 మందిని కేన్సర్ అనుమానితులుగా గుర్తించాం.కార్యక్రమంలో ఇంటి వద్దనే 18 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులకు ఉచితంగా కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తాం. మహిళలలో రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్, పురుషులలో నోటి కేన్సర్ సంబందించిన పరీక్షలను చేస్తున్నాం. ప్రజలు నిర్లక్ష్యం, ఆలసయం చేయకుండా ఇంటి వద్దనే కేన్సర్ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. గహ సందర్శనలు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసే సిబ్బందికి ప్రజలు సహకరించాలి. వీటితో పాటు ఎన్‌సిడి(నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) 3.0 భాగంగా సమగ్ర ఆరోగ్య సర్వే నిర్వహించి బిపి, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలను ఇంటి వద్దనే చేస్తారు. జిల్లా ప్రజలు సహకరించాలని కోరుతున్నాం.

పుట్టుకతో లోపాలున్న పిల్లలకు పరీక్షలు

జిల్లాలో 0–18 సంవత్సరాల లోపు పుట్టుకతో లోపాలున్న పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. పుట్టుకతో లోపాలు ఉన్న పిల్లలు, పుట్టుకతో అంగవైకల్యం, పిల్లల పెరుగుదలలో ఆలస్యం వంటి వ్యాధులను నివారించేందుకు అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ప్యానెల్ న్యాయవాదులతో బృందాలు ఏర్పాటు చేసి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యాధులపై అవగాహన కల్పించి ప్రాథమిక దశలోనే వాటి నుండి పిల్లలను రక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ, మహిళా అభివద్ధి శిశు సంక్షేమశాఖ న్యాయశాఖ బందాలు ఏర్పడి ఈనెల 10 నుంచి 24 వరకు గహ సందర్శన నిర్వహించి ఆయా లక్షణాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారిని తగిన పరీక్షల కోసం జిల్లా బాల భవిత కేంద్రానికి పంపాలని ఆదేశించాం.

బాల్య వివాహాల నివారణకు చర్యలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా మానస పుత్రిక 'బంగారు బాల్యం' కార్యక్రమంలో సంబంధిత శాఖల సహకారంతో బాల్య వివాహాలను నివారించేందుకు కృషి చేస్తున్నాం. ఈ వివాహాలతో కలిగే మానసిక, సామాజిక, ఆరోగ్య పరిణామాలపై ప్రజలకు ముఖ్యంగా ఆడ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. బడి ఈడు పిల్లలను గుర్తించి వారిలో పాఠశాలలో మానివేసిన పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గహ సందర్శనలు చేసేటప్పుటు పిల్లల పౌష్టికాహార పరిస్థితులను పరిశీలిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలలో సరఫరా చేస్నే అన్ని పౌష్టికాహారాహార పదార్థాలు పిల్లలు తప్పక తినేవిధంగా చూడాలని సూచించాచరు. త ద్వారా పోషక ఆహార లోపాలను నివారించవచ్చు. కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బంగారు బాల్యంలో ఆడపిల్లలకు సకాలంలో సరైన వైద్యపరీక్షలు, పౌష్టికాహారం, విద్యను అందిస్తే బాల్య వివాహాలను సైతం నివారించవచ్చు. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.